# కాకతీయ యుగము

ఆంధ్రుల చరిత్రలో కాకతీయులకాలం చాల ముఖ్యమైన ఘట్టం. కొందరు దీన్ని స్వర్ణయుగం అనడం కూడ కద్దు శాతవాహనుల ఆనంతరం ఆంధ్ర దేశాన్ని జాతిని సమ్యైక్యం చేసి, ఏకచత్రాధిపత్యం కిందికి తెచ్చిన హైందవ రాజవంశీయులు కాకతీయు లొక్కరే. నాటివరకు బలంగా ఉన్న వేంగి, వెలనాడు, పాకనాడు, రేనాడు అనే ప్రాంతీయ రాజకీయాభిమానాలు తొలగించి, ఆంధ్రత్వానికి సమగ్రమైన రూపం దిద్ది, జాతీయ భావాన్ని సాధించింది కాకతీయులే. వారి కాలంలోనే ఆంధ్ర, త్రిలింగ పదాలు సమానార్థకాలై, దేశపరంగా జాతిపరంగా ప్రచారమయినాయి. కాకతీయులు ఆంధ్ర దేశాధీశ్వర బిరుదం ధరించినారు. వారి రాజధానియైన ఓరుగల్లు ఆంధ్రనగరి. ఆంధ్ర భాషకు ఆదరాభిమానాలు అధికం కాజొచ్చినాయి. అనేక మతసాంఘిక పరిణామాలు జరిగి, ఆంధ్ర సమాజం నేటి రూపం ధరించింది. ప్రాంతీయాభిమానాలు విస్మరించి, ఆంధ్రజాతీయోజ్జీవనానికై ఆంధ్రులు కాకతీయ యుగంలో కృషి సల్పినారు. ఆంధ్రుల చరిత్రలోనేగాక యావద్భారత చరిత్రలో కాకతీయులు గణనీయమైన పాత్రను నిర్వహించినారు. ఉత్తర భారతంలో రాజపుత్రులవలె దక్షిణాన తురుష్క-సేనావాహినుల నరికట్టి, హైందవ స్వాతంత్ర్య సంస్కృతులను రక్షించడానికై కాకతీయులు తమసర్వస్వాన్ని ధారపోసినారు. వారి దేశభక్తి,స్వాతంత్ర్య దీక్ష వారి అనంతరం ఆంధ్రదేశాన్ని పాలించిన రెడ్డి, విజయ నగరాధీశులకు ఆదర్శమై, దక్షిణాపథంలో హైందవసంస్కృతిరక్షణకై వారిచేకంకణం ధరింప జేసినాయి.

**వంశం పుట్టుపూర్వోత్తరాలు :**

కాకతీయులు కూడా చాళుక్యులవలె కర్ణాటకం నుండి ఆంధ్ర దేశానికి వచ్చి స్థిరపడినవారే. వారిని గురించిన మొదటి ప్రస్తావన తూర్పు చాళుక్య రాజు దానార్ణవుని మాగల్లు శాసనం (క్రీ.శ. 950) లో ఉంది. ఈ శాసనం గుండియ రాష్ట్రికూటుని ప్రపౌత్రుడు కాకత్య గుండ్యనగా పేర్కొంటున్నది. గుండియ కొడుకు ఎరియరాష్ట్రికూటుడు. అతని కొడుకు బేతియ. ఈ బేతియ కొడుకైన కాకత్య గుండ్యనకు కాకతీయులకు సంబంధం లేదేమోనని చరిత్రకారులు